రక్తదానం చేసి అభాగ్యుల ప్రాణాలు కాపాడాలి

- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

అమ్రాబాద్ : ప్రమాణస్వీకారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటరూరల్, సెప్టెంబర్ 5 : ప్రతిఒక్కరూ రక్తదానం చేసి అభాగ్యుల ప్రాణాలను కాపాడాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మసీదు కమిటీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా రెడ్‌క్రాస్ శాఖ సహకారంతో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో దాదా పు 95మంది రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌రెడ్డి, కన్వీనర్ కుమార్, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, మసీదు కమిటీ అధ్యక్షుడు సిద్ధిఖ్, దర్గా కమిటీ అధ్యక్షుడు రఫీ, నాయకులు ఖాదర్, ముస్లింలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకమండలి ప్రమాణస్వీకారం

అమ్రాబాద్, సెప్టెంబర్ 5 : పదర మండలంలోని మద్దిమడుగు గ్రామంలో వెలిసిన పబ్బతి ఆంజనేయస్వామి దేవస్థాన నూతన పాలకమండలి ప్రమాణస్వీకరం ఆలయ ఆవరణలో ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు ఆలయ ఈవో రంగాచారి అర్చకులు స్వాగతం పలికి అనంతరం అంజన్నకు ప్రత్యేక పూజలు చేశారు. నూతన పాలకమండలిలో రాములునాయక్‌ను చైర్మన్‌గా ఎన్నుకొని పాలకమండలి సభ్యులతో ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం చేయించారు. ఎమ్మెల్యేకు, నూతన పాలక మండలిని దేవస్థానం తరపున శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నూతన పాలక మండలి సభ్యులు, ఆలయ అర్చకులు వీరయ్య, త్రిపాఠి, రఘు సిబ్బంది ప్రజాప్రతినిధులు, భక్తులు, పాల్గొన్నారు.

సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు

- విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే మేధావులు
- అజ్ఞాన అంధకారాలను పారదోలే విజ్ఞాన వంతులు
- ప్రభుత్వం విద్య, వైద్యంపై ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉంది
- సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 5 : ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే మేధావులు, అజ్ఞాన అంధకారాలను పారద్రోలే విజ్ఞాన వంతులని సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించగా మంత్రి జూపల్లి ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉ పాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి హోదా లో పనిచేశారని, ఆయన పుట్టిన రోజున ఉపాధ్యాయ ది నోత్సవం జరుపుకొంటున్నామని, ఉపాధ్యాయులందరి కీ శుభాకాంక్షలు తెలిపారు. మనిషి తనకు తాను సంస్కరించుకొని సమాజ పురోభివృద్ధికి పాటుపడే విధంగా ఉత్తమ వ్యక్తులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అని కొనియాడారు. ఉపాధ్యాయుల ద్వారానే సమాజంలో మా ర్పు వస్తుందని, విద్యార్థులకు సద్గుణాలు నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య పడిపోకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యంపై ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో దాదాపు 60 లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా అందులో కేవలం 22 లక్షల మంది విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను బోధించడం జరుగుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తనకు వచ్చే 10 కోట్ల బడ్జెట్‌తోపాటు సీఎస్ఆర్ ఫండ్ సైతం వి ద్య, వైద్యానికే ఖర్చు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ గురు వు అంటే మార్గదర్శి, నిపుణుడు, ఉపాధ్యాయుడు అన్నా రు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ సమాజంలో ఉన్న వృత్తుల న్నింటికల్లా విశిష్టమైనది ఉపాధ్యాయ వృత్తి అని, ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ విద్యార్థుల భవిష్యత్తుపై నిరంతరం శ్రమించే ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని కలెక్టర్ అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు భావిభారత పౌరులైన విద్యార్థులకు బంగారు భవిష్యత్తును చూపించాలని కో రారు. అనంతరం జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 58 మంది ఉపాధ్యాయులను శాలువా లు, మెమోంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

గవర్నర్‌ను కలిసిన గోళి శ్రీనివాస్‌రెడ్డి

గవర్నర్‌ను కలిసిన గోళి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ, సెప్టెంబర్ 5 : రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులతో పాటు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన గోళి శ్రీనివాస్‌రెడ్డి, ఫుడ్ కమిషన్ సభ్యులు ఆయనకు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ సభ్యులు ఆనంద్, భారతి, జ్యోతి పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి ఆహ్వానం

కొల్లాపూర్, సెప్టెంబర్ 5 : కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులకు ద రఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు స్వయంగా తమ దరఖాస్తులను సోమవారంలోగా కళాశాలలో అందజేయాలని, మరిన్ని వివరాలకు కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వచ్చి సంప్రదించాలని కోరారు.

రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక

కొల్లాపూర్, సెప్టెంబర్ 5 : రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహా ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కొల్లాపూర్ పట్టణంలో జరిగిన రజకుల పట్టణ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కొల్లాపూర్ రజక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రజక సంఘం పట్టణాధ్యక్షుడిగా తిప్పరాజుల సన్ని, గౌరవ అధ్యక్షుడిగా మహంకాళి, కార్యదర్శి పరశురాం, ఉపాధ్యక్షుడిగా జగదీశ్ ఎన్నికయ్యారు. రజక సంఘం సీనియర్ నాయకులు నర్సింహా, శివశంకర్, సత్యనారాయణ, వెంకటస్వామిలు నూతన కమిటీ సభ్యులను శాలువాతో సన్మానించారు.

విద్యార్థులు ఉన్నత విద్యావంతులు కావాలి

- వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ మాధవరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

వెల్దండ, సెప్టెంబర్ 5 : విద్యార్థులు లక్ష్యం పెట్టుకొని చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ మాధవరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు, విద్యార్థినులు చూడముచ్చటగా ముస్తాబై ఆట, పాటలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపాల్‌రావు, రిటైర్డ్ ఇక్రిశాట్ శాస్త్రవేత్త ప్రసాద్, అధ్యాపకులు శివప్రసాద్, రమేశ్, ప్రవీణ, విజయలక్ష్మి, శివశంకర్, భరత్, హుస్సేన్, జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో దమయంతి

లింగాల, సెప్టెంబర్ 5 : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని బల్మూర్ క్లస్టర్ సీడీపీవో దమయంతి అన్నారు. పోషణ్ అభియాన్ (పోషణ మాసాన్ని)ను పురస్కరించుకొని మండలంలోని రాయవరం, ధారారం, అంబట్‌పల్లి తదితర గ్రామాల్లో బాలలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బల్మూర్ క్లస్టర్ సీడీపీవో దమయంతి మా ట్లాడుతూ పోషణ లక్ష్యసాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గిరిజ, విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కల్వకుర్తి మండలంలో..

కల్వకుర్తిరూరల్, సెప్టెంబర్ 5 : గర్భిణులు, యువతులు, బాలికలు నిత్యం పోషక విలువలున్న ఆహారాన్ని తప్పకుండా తీసుకోవాలని ఐసీడీఎస్ కల్వకుర్తి సూపర్ వైజర్లు పద్మావతి, దేవమ్మ కోరారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్-1 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాసోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణ్ అభియాన్‌పై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సునిత, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, అరుణ, బాలింతలు, గర్భిణులు ఉన్నారు.

10 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

కొల్లాపూర్, సెప్టెంబర్ 5 : నేటి సమాజంలో కంప్యూటర్ విద్య కీలకమైందని విద్యార్థి, నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ ధర్మతేజ తెలిపారు. గురువారం ఆయన రత్నగిరి ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నుంచి తమ కార్యాలయం లో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇ వ్వనున్నాట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9177050558 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

వరద బాధితులకు విరాళం

నాగర్‌కర్నూల్/అచ్చంపేట, సెప్టెంబర్ 5 : వరద బాధితులకు జిల్లా కేంద్రానికిచెందిన ప్రైవేట్ ఫిజిక్స్ ఫ్యాకల్టీ, సామాజిక కార్యకర్త అరుణ్ కుమార్ తన మిత్రుల సాయంతో రెండు తెలుగు రాష్ట్రాలకు రూ.5వేల చొప్పున సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10వేలు ఆన్‌లైన్ ద్వారా డొనేట్ చేసినట్లు వెల్లడించారు. వరద బాధితులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన వరద బాధితులను ఆదుకునేందుకు అచ్చంపేట మాజీ సర్పంచ్ సుదర్శన్ తనవంతుగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.25వేలు విరాళం అందజేశారు. వరదలో చిక్కుకొని చాలా మంది ప్రాణాలు కోల్పోయారని, అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎంపీడీవోగా వెంకటయ్య

అమ్రాబాద్, సెప్టెంబర్ 5 : మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోగా వెంకటయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగ నిర్వహణలో భాగంగా అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ అధికారులతో కలిసి గ్రామాల్లో ఉండే సమస్యలను పరిష్కరిస్తానని ప్రజలకు అందుబాటులో ఉండి విధులు నిర్వహిస్తానని ఎంపీడీవో పేర్కొన్నారు.

గురువులు భవిష్యత్‌కు మార్గదర్శకులు

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

కల్వకుర్తిరూరల్ : తర్నికల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సభ్యులు

వెల్దండ, సెప్టెంబర్ 5 : గురువులు భవిష్యత్ చూపే మార్గదర్శకులని రాచూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో గురువారం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఆయా పాఠశాలల్లో పని చేసే ప్రధానోధ్యాయులను పూలమాల, శాలువాలతో సన్మానించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జంగయ్య, రాధాకృష్ణ, అమర్‌సింగ్ ఉన్నారు.

అచ్చంపేట మండలంలో

అచ్చంపేటరూరల్/అచ్చంపేటటౌన్, సెప్టెంబర్ 5 : మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని సింగారం ప్రాథమికోన్నత పాఠశాలలో సర్వేపల్లి చిత్రానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో డీఈవో డాక్టర్ గోవిందరాజులు జిల్లా పరిషత్ ఐనోల్ జీహెచ్ఎంగా పనిచేస్తున్న బాలస్వామి, గోపాల్‌నాయక్‌లకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డుతోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. అదేవిధంగా అచ్చంపేట పట్టణంలో అచ్చంపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముక్తాల వెంకటేశ్, సెక్రటరీ శ్రీనివాసులు, సభ్యులు చంద్రకుమార్, యూఎల్.చారి, బాలాజీ, డాక్టర్ లింగారెడ్డి, డా.వెంకటేశ్, రమేశ్, దాసు సాయిబాబు, హెచ్ఎం గోపాల్‌నాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

లింగాల మండలంలో..

లింగాల, సెప్టెంబర్ 5 : సమాజంలో ప్రతి వ్యక్తి యొక్క జీవిత వికాసానికి గురువే తొలి మార్గదర్శిగా నిలిచి సామాజానికి ఆదర్శంగా వెలుగొందుతున్నారని జీహెచ్ఎం బషీర్‌అహ్మద్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ, సరస్వతీ దేవి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు వి ద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.

కల్వకుర్తి మండలంలో..

కల్వకుర్తిరూరల్, సెప్టెంబర్ 5 : సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమైందని పలువురు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్ఎంలు అన్నారు. గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సర్వేపల్లి జయంతిని పురస్కరించుకుని గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. తర్నికల్ గ్రామంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రిటైర్డ్ అధ్యాపకులు, ఉపాధ్యాయులకు శాలువా లు కప్పి, పూలమాలతో సన్మానించారు. పట్టణంలోని వీబీఎస్ పాఠశాలలో రిటైర్డ్ ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డికి పాఠశాల ప్రిన్సిపాల్ రాములు, కరస్పాండెంట్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు.

అమ్రాబాద్ మండలంలో..

అమ్రాబాద్, సెప్టెంబర్ 5 : సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాల్లోని ఆయా పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దకొత్తపల్లి మండలంలో..

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 5: మండలంలోని దేవునితిర్మలాపూర్, పెద్దకారూపాముల, పెద్దకొత్తపల్లి గ్రా మాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లిరాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు సుధాకర్‌ను, మహిళా ఉపాధ్యాయుల ను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం సం ధ్యారాణి, పాఠశాల చైర్మన్ సునీత, ఉపాధ్యాయులు భారతి, రమాదేవి పాల్గొన్నారు.

వంగూరు మండలంలో..

వంగూరు, సెప్టెంబర్ 5 : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు, హెచ్ఎంను ఘనంగా సన్మానించారు. ఉప్పలపహాడ్ గ్రామంలో గ్రామాని కి చెందిన బీఆర్ఎస్ యువ నేత నర్సిరెడ్డి విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


లింగాల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయల దినోత్సవాన్ని జరుపుకొన్న ఉపాధ్యాయులు

కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్, సెప్టెంబర్ 5 : ఉపాధ్యాయుల త్యాగంతోనే దేశ నిర్మాణం జరుగుతోందని బీఆర్ఎస్ మున్సిపల్ కమిటీ అధ్యక్షుడు సాంబశివుడు అన్నారు. గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు కట్టా శ్రీనివాస్, హరికృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

చారకొండలో..

చారకొండ, సెప్టెంబర్ 5 : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, విశ్వశాంతి విద్యాలయంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ కేసీ ప్రమీల, జీహెచ్ఎం భగవాన్‌రెడ్డి, ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను శాలు వా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో విశ్వశాంతి కరస్పాండెంట్ శ్రీనివాస్‌గౌడ్, ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు బాలాజీనాయక్, కమాలాకర్‌రావు, యాదగిరి, డాక్యానాయక్, రాజేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌లో..

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 5 : నాగర్‌కర్నూల్ పట్టణంలో విశ్రాంత ఉద్యోగులు భవనంలో, మున్సిపల్ పరిధిలోని పలు గ్రామాలు, మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల భవనం ఎదుట ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎండబెట్లలో యూపీఎస్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

బిజినేపల్లి మండలంలో..

బిజినేపల్లి, సెప్టెంబర్ 5: మండలంలోని పాలెం, శాయిన్‌పల్లి, కారుకొండ, బిజినపల్లి గ్రామాల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు, సిబ్బంది శాలువాలు, పూలమాలతో సన్మానించారు. నాడు ఆయన చేసిన సేవల గురించి విద్యార్థులకు వివరించారు.

మట్టి వినాయకులను ప్రతిష్ఠించుకుందాం..

మట్టి వినాయకులను తయారు చేస్తున్న విద్యార్థులు

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 5 : పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక నవరాత్రి ఉత్సవాల్లో మట్టి వినాయకులను ప్రతిష్ఠించుకుందామని కల్వకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రసూనా అన్నారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏకో క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు మట్టి వినాయకుల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రూపులుగా ఏర్పడి వివిధ ఆకృతుల్లో వినాయక మట్టి విగ్రహాలను తయారు చేశారు. మట్టి విగ్రహాల వల్ల కలిగే ప్రయోజనాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జైపాల్ రెడ్డి, శివప్రసాద్, జయప్రకాశ్, కవిత, అనిత ఉన్నారు.

మట్టి విగ్రహాల పంపిణీ

కల్వకుర్తి పట్టణంలోని రెవెన్యూ కార్యాలయ సమీపంలో గురువారం బీజేపీ నాయకులు రాంభూపాల్‌రెడ్డి 1,116 మట్టి వినాయక విగ్రహాలను పట్టణ ప్రజలకు పంపిణీ చేశారు. మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడుకుందామని కోరారు. కార్యక్రమంలో వైద్యులు వీరమల్ల శరత్, నాయకులు రాంచెంద్రారెడ్డి, శేఖర్ రెడ్డి, రవిగౌడ్, నర్సింహ, బాబిదేవ్, విజయ్, చందు, జగన్, శివ, సురేశ్ ఉన్నారు.

కోడేరు : రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి

కోడేరు, సెప్టెంబర్ 5 : మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె దవాఖానలోని డాక్టర్లు, సిబ్బంది హాజరు పట్టికను, పలు రికార్డులను పరిశీలించారు. రోగులకు ఎన్ని రకాల మందులను అందజేస్తున్నారని ఫార్మాసిస్టును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డాక్టర్ ఇతర వైద్య శాఖ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు గ్రామాల్లోని ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని తెలిపారు. డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని నిర్లక్ష్యంగా ఉంటున్నారని స్థానిక బీజేపీ నాయకులు బద్దుల రాజు, చంద్రయ్య, అశోక్, రవి డీఎంహెచ్‌వోనుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో ఆమోస్, పీహెచ్‌సీ డాక్టర్ దశరథం, ల్యాబ్ టెక్నీషియన్ నారాయణ, యునాని డాక్టర్ తయ్యాబ్, సిబ్బంది కళావతి మంగమ్మ పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 5 : పెద్దకొత్తపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలో రోగులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకొని, రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ దవాఖానకు ఎక్కువ శాతం పేదలు వస్తారని, వారికి అన్ని రకాల వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. మొదటిసారి దవాఖానకు వచ్చిన డీఎంహెచ్‌వోను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటదాసు, సూపర్‌వైజర్ శ్రీనివాసులు, లక్ష్మీనర్సింహాగౌడ్, భాగ్యమ్మ పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 5: జిల్లాలో గణపతి విగ్రహాలు ప్రతిష్ఠించే ఉత్సవ కమిటీలు ఆన్‌లైన్‌లో పక్కాగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ గురువారం తెలిపారు. https://police portal.tspolice.in వెబ్‌సైట్‌లో మొబైల్ ఫోన్‌లోనూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. విగ్రహాల వద్ద కరెంట్‌ను తీసుకొనే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎలాంటి ఇబ్బందులు కలగక